క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



వాహనదారులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న జనార్దన్‌రెడ్డి

హుస్నాబాద్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆర్‌టీఏ కార్యాలయ ఆవరణలో గురువారం ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణపై ఎంవీఐ జనార్దన్‌రెడ్డి వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపొద్దని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అశోక్ కుమార్, చేతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు సర్దార్‌ఖాన్

గజ్వేల్‌రూరల్: కాంగ్రెస్‌లో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలనలో విద్యార్థులు, ప్రజాసమస్యలపై విద్యార్థి సంఘం నేత బల్మూరి వెంకట్‌తో పాటు ప్రస్తుతం పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్ నిరంతరం పోరాటం చేస్తూ ముందుకు సాగారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపికై నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలు, బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటం బహూకరణ



సీఎం చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మార్కెట్ కమిటీ కార్యాలయానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని బహూకరించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి కనకరాజు, మండల పార్టీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఏర్పాటు చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: హుస్నాబాద్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపుల్లో అన్నివర్గాల విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో గానీ, ప్రత్యక్షంగా పాఠశాలకు వచ్చి అందజేయవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'మోడల్'లో ప్రవేశాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మోడల్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మలత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 2023–24లో 6వ తరగతి ప్రవేశాలతో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు ఓసీ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు రూ.125 ఫీజు చెల్లించాలన్నారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రవేశాలకు గడువు పొడిగింపు

గజ్వేల్‌రూరల్: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్/జేసీ(బాలురు, వర్గల్) ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల (ఎస్సీ, ఎస్టీ, బీసీ)లో 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని, మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 180042545678 నంబరులో సంప్రదించాలని సూచించారు.



దుబ్బాక బస్టాండ్ సమీపంలో ఓ షాపు వద్ద ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



భవనాన్ని ఆనుకొని ప్రమాదకర స్థితిలో ఉన్న తీగలు

ఇళ్ల మధ్య యమపాశాలు

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. పాత రోడ్డు, కొత్త రోడ్డుతో పాటు గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ విగ్రహాల వైపు వెళ్లే దారుల్లో భవనాలకు ఆనుకొని విద్యుత్ తీగలు ఉన్నాయి. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన కాలనీల్లో దాదాపు 100కు పైగా ఇళ్లపై విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. భవనాలకు దగ్గరగా ఉండడం వల్ల బట్టలు ఆరేసేటప్పుడు ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో కొన్నిచోట్ల షాపులకు ఆనుకొని విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. ఇదే విషయమై దుబ్బాక ఏఈ రామాంజనేయులును వివరణ కోరగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

పరామర్శ



ఫారూఖ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: గుండె శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్ బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌ను గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అనిల్ కుమార్, సికిందర్ తదితరులు ఉన్నారు.

సాగు నీరు విడుదల చేయండి



మంత్రి కొండా సురేఖతో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మల్లన్నసాగర్ నుంచి సాగు నీరును సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు విడుదల చేయాలని దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట ఇంచార్జ్ పూజల హరికృష్ణ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. నాలుగు రోజుల్లో సాగునీరు విడుదల చేసే విధంగా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

ఓఆర్‌ఆర్‌తో మా పొట్ట కొట్టొద్దు

కొండపాక(గజ్వేల్): ఔటర్ రింగు రోడ్డు నిర్మాణంతో మా పొట్ట కొట్టొదంటూ బాధితులు ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నారు. మండలంలోని దుద్దెడలో గురువారం సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఔటర్ రింగు రోడ్డు నిర్మాణ విషయమై గ్రామ సభ నిర్వహించారు. ఇప్పటికే దుద్దెడ శివారులో సమీకృత కలెక్టరేట్ కార్యాలయ భవన నిర్మాణ పనుల్లో, టోల్ ప్లాజా నిర్మాణ పనుల కోసం రూ. కోట్ల విలువ చేసే ఎకరాల కొద్ది వ్యవసాయ భూములు కోల్పోయామని బాధితులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మళ్లీ ఔటర్ రింగ్ రోడ్డుతో జీవనాధారంగా మారిన ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూములు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం నుంచి ఉన్న రాజీవ్ రహదారికి రెండు వైపులా కాస్త విస్తరణ చేస్తూ నిర్మాణం చేయడంతో తక్కువ నష్టం జరుగుతుందన్న విషయాన్ని గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చారు. అలా కాకుండా గ్రామం బయట నుంచి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు చేపడితే అడ్డుకుంటామని.. అవసరమైతే ప్రాణ త్యాగానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శివకుమార్, కాట రమేష్, ఆర్‌అండ్‌బీ అధికారులు, నాయకులు, బాధితులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సమ్మిరెడ్డి

దుబ్బాక: గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను గ్రామ సభల తీర్మాణం మేరకు వినియోగించాలని గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల శిక్షణాధికారి, ఎంపీడీఓ సమ్మిరెడ్డి అన్నారు. గురువారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట మండలాల పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేయడానికి గ్రామస్థాయి నుంచి ప్రణాళికలు తయారు చేసుకుని ఆన్‌లైన్ చేయాలన్నారు. పంచాయతీల తీర్మాణాలు, నిధుల వ్యయం వివరాలను ఈ– గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు భాస్కరశర్మ, రాజేష్, శ్రీధర్, రాజిరెడ్డి, ఎంపీఓలు నరేందర్‌రెడ్డి, గఫూర్‌ఖాద్రీ, జహీరోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఉత్సవ సమితి సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 21న జిల్లా కేంద్రంలో నిర్వహించే శ్రీరామ శోభాయాత్రను విజయవంతం చేయాలని, సిద్దిపేట ధర్మకార్య ఉత్సవ సమితి సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేటలో ఉత్సవ సమితి సభ్యుడు జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 21న పట్టణంలోని మోహినిపూర వెంకటేశ్వర ఆలయం నుంచి వివేకానంద చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, సుభాష్‌రోడ్, పాత మార్కెట్, లాల్ కమాన్ గుండా వైశ్యభవన్ వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట ధర్మకార్య ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

యువజన క్రీడోత్సవాలు ప్రారంభం



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

హుస్నాబాద్: స్వామి వివేకానంద అతి చిన్న వయసులోనే మన దేశ ఖ్యాతిని, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి అని ఏబీవీపీ జిల్లా సంఘటన మంత్రి లక్ష్మీపతి కొనియాడారు. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో యువజన క్రీడోత్సవాలను నిర్వహించారు. మొదటి రోజు కళాశాల విద్యార్థులకు వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య, నాయకులు రాకేష్, చరణ్, రాజేష్, రాజు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట పట్టణంలోని ధోబిగల్లి రామాలయ ఆవరణలో స్వచ్ఛ భారత్ చేపట్టారు. స్వచ్ఛ అభియాన్‌లో భాగంగా రామాలయం శుభ్రం చేశారు. ఈసందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి ఒక్క హిందువు పండుగ చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పత్రి శ్రీనివాస్ యాదవ్, కోడూరి నరేష్, బాసంగారి వెంకట్, అంబటిపల్లి శ్రీనివాస్, గోనె మార్కండేయులు, పాము పడిగే వేణుగోపాల్, సంతోష్, యాదన్ రావు, కృష్ణ, నగేష్, ఎల్లయ్య, హేమంత్, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రామాలయ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న నాయకులు



సేకరించిన చెత్తతో పారిశుధ్య కార్మికులు

ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ హెచ్చరించారు. గురువారం 4వ వార్డు పరిధిలోని కేసీఆర్ కాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో వేసిన ప్లాస్టిక్, ఇతర చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మద్దూరు(హుస్నాబాద్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సుదీర్‌రాజ్ అన్నారు. గురువారం ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వివిధ వ్యాధులపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రధానంగా పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. మాతాశిశు సంరక్షణ, ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజల్లో నెలకొన్న భయాన్ని తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి

రేషన్ బియ్యం స్వాధీనం

నెక్కొండ: అక్రమంగా తరలిస్తున్న 29 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ జానీపాషా తెలిపారు. ఎస్సై వెల్లడించిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం మండల కేంద్రంలోని చల్లా గోదాముల బైపాస్ రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కేసముద్రం వైపు వెళ్తున్న అశోక లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనాన్ని తనిఖీ చేయగా 29 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ మేతే సాయితరుణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అదే జిల్లాకు చెందిన బాలయ్య ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లికి చెందిన నల్లా శ్రీధర్ ఈ బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు తేలిందని ఎస్సై వెల్లడించారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంతాపం

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నీరుడి జనార్దన్ మృతి తీరని లోటని మండల నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. గురువారం పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విఠల్‌నాయక్, రామకృష్ణాగౌడ్, మారుతి, రవీందర్, రాజేశ్వర్, ఉపాధ్యాయులు సంతోష్, సిద్ధిరాములు, సత్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ బాధితులకు న్యాయం చేయాలి

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ ప్రాజెక్టు ముంపు బాధితులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టి ప్రాజెక్టును పూర్తి చేసినప్పటికీ... భూబాధితులకు ఇంతవరకు న్యాయం చేయలేదని ఆరోపించారు. బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఇంటికి ఇళ్లు, బడి, గుడి, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకుంటామని మాయమాటలు చెప్పి వారిని మోసం చేసిందని మండిపడ్డారు. న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించిన వారికి మాత్రమే పరిహారం లభించగా.. అధికారులు, ప్రజాప్రతినిధుల మాటలు నమ్మిన వారు మోసపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టీచరమ్మ ఔదార్యం

గజ్వేల్: గజ్వేల్ మండలం కొల్గూర్‌లో తల్లిదండ్రుల మరణంతో అనాథలైన ఐదేళ్లలోపు చిన్నారులు కావ్యశ్రీ, శ్రీవాణి, రిషిత్‌కుమార్‌కు అహ్మదీపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సౌజన్య అండగా నిలిచారు. వీఆర్‌ఏ విధుల నిర్వహిస్తున్న వారి తల్లి నీరుడి కవిత ఇటీవల మృతిచెందగా, తండ్రి భాస్కర్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విషయం తెలుసుకున్న సౌజన్య తనతో పాటు మిత్రుల సహకారంతో రూ. 14 వేల ఆర్థిక సాయాన్ని గురువారం పిల్లల బంధువులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొడుగు జ్యోతి, వార్డు మెంబర్లు బాలకిషన్, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.



పిల్లల బంధువులతో ఉపాధ్యాయురాలు సౌజన్య

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఎనిమిది మందిపై కేసు

సిద్దిపేటకమాన్: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఓ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన ఇద్దరి వాహనాలు ఎదురుపడ్డాయి. వాహనాలకు దారి ఇచ్చే విషయంలో పరస్పరం ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఇరువర్గాలకు చెందిన వారు సిద్దిపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎలాంటి గొడవ జరగకుండా పోలీసులు వారిని చెదరగొట్టారు. స్టేషన్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘటనపై ఇరువర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేయగా సీసీ పుటేజీల ఆధారంగా గురువారం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **పథకాలు సద్వినియోగం చేసుకోండి**

తొగుట(దుబ్బాక): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర మండల కన్వీనర్, చందాపూర్ సర్పంచ్ నర్సింలు కోరారు. మండలంలోని లింగాపూర్, బంజేరుపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను గురువారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రజిత, మంజుల, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

◆ **సకాలంలో రుణాలు చెల్లించాలి**

మద్దూరు(హుస్నాబాద్): స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది, తిరిగి చెల్లించని వారు వెంటనే చెల్లించాలని మద్దూరు ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జాగృతి మండల సమాఖ్య కార్యాలయంలో వీఓల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీజీవీబీ బ్యాంకు పరిధిలో 40 గ్రామైఖ్య సంఘాలు రూ.1 కోటి 5 లక్షల రుణాలు చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రవీందర్, సీసీలు ప్రేమలత, మహేందర్, సిద్ధిమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **నూతన కార్యవర్గం**

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ నాన్ టీచింగ్ స్టాఫ్ జిల్లా కమిటీని గురువారం సిద్దిపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా చక్రవర్తి ఎన్నికయ్యారు. అనంతరం అనేక సమస్యలపై చర్చించారు.

◆ **చట్టాలపై అవగాహన**

కోహెడరూరల్ (హుస్నాబాద్): మండలంలోని చెంచర్వుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా తదితర వాటిపై కోహెడ ఎస్సై తిరుపతి గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

◆ **నిరసన**

చేర్యాల(సిద్దిపేట): అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలంటూ గురువారం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కిష్టయ్య, నాయకులు నరసింహ, విజయ్, రామదాసు, యాదయ్య, భాగయ్య, భాస్కర్, సహదేవులు తదితరులు పాల్గొన్నారు.

◆ **పరిశుభ్రతతో వ్యాధులు దూరం**

కొండపాక(గజ్వేల్): వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేసుకోవచ్చని కొండపాక ప్రభుత్వ ఆసుపత్రి ఆయుర్వేద వైద్యురాలు రజని పేర్కొన్నారు. కొండపాకలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చలికాలంలో వ్యాపించే వ్యాధుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

◆ **పండ్లు పంపిణీ**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని పట్టణ నిరాశ్రయుల నిర్వహణ కేంద్రాన్ని గురువారం సిద్దిపేట మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ సందర్శించారు. అనంతరం వృద్ధులకు, నిరాశ్రయులకు పండ్లు పంపిణీ చేశారు. ఏ అవసరం వచ్చిన నిర్వాహకులు తనను ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు.

◆ **కరసేవ ప్రముఖ్ అశోక్‌కు సన్మానం**

హుస్నాబాద్: అప్పటి శ్రీరామ జన్మభూమి ఉద్యమ కరసేవ ప్రముఖ్, బీజేపీ నాయకుడు కొత్తపల్లి అశోక్‌ను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు హుస్నాబాద్ నుంచి 1990లో మొదటిసారిగా, 1992 రెండోసారి కరసేవకు తరలివెళ్లానని తెలిపారు. పోలీస్‌ల లాఠీ దెబ్బలు తిని రోజుల తరబడి జైలు జీవితం అనుభవించి చివరకు అయోధ్యకు వెళ్లి దర్శనం చేసుకోవడం తన అదృష్టమని పేర్కొన్నారు.

